సాక్షి
సూర్యాపేట
ఆదివారం । 6 । ఆగస్టు । 2023


వైద్య సిబ్బంది నిర్లక్ష్యానికి..
తుంగతుర్తిలోని ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య సిబ్బంది నిర్లక్ష్యానికి పసికందు బలైంది. - 12లో


అందుబాటులోకి యూపీఐ సేవలు
డీసీసీబీలో యూపీఐ సేవలు అందుబాటులోకి వచ్చాయని డీసీసీబీ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి తెలిపారు. - 12లో



నేడు శంకుస్థాపన
యాదాద్రి రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనులకు ప్రధాని మోదీ ఆదివారం వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్నారు. - 12లో

న్యూస్‌రీల్

‘చలో హైదరాబాద్’ను విజయవంతం చేయాలి

సూర్యాపేటటౌన్ : ఈ నెల 12న సీపీఎస్ ఉద్యోగులు చేపట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు లక్కపాక ప్రవీణ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. జిల్లాలోని సీపీఎస్ ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని పాత పెన్షన్ ఆకాంక్షను చాటి చెప్పాలని సూచించారు.

మున్నూరుకాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా జేవీఆర్


నియామకపత్రం అందజేస్తున్న దేవయ్య

హుజూర్‌నగర్ : మున్నూరు కాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా జల్లేపల్లి వెంకటేశ్వర్లు (జేవీఆర్) నియమితులయ్యారు. శనివారం హైదరాబాద్‌లో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య పటేల్, వర్కింగ్ ప్రెసిడెంట్ హరి శంకర్ పటేల్‌లు ఆయనకు నియామకపత్రం అందజేశారు. ప్రస్తుతం ఆయన వైఎస్సార్ టీపీ జిల్లా అధ్యక్షుడిగా, హుజూర్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా ఉన్నారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. తన నియామకానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు.

పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం కృషి


పనులను పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ

పెన్‌పహాడ్: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని డీఆర్‌డీఓ సుందరి కిరణ్‌కుమార్ అన్నారు. పెన్‌పహాడ్ మండలం గాజులమల్కాపురం గ్రామంలో మన ఊరు–మనబడి కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పనులను శనివారం ఆయన పరిశీలించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి మెనూ వివరాలను అడిగి తెలుసుకున్నారు. క్రీడా ప్రాంగణం, మెగా పల్లె ప్రకృతి వనం స్థలాలను పరిశీలించారు. అంగన్‌వాడీ సెంటర్లను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీఓ నరేష్, ఏపీఓ రవి, పంచాయతీ కార్యదర్శి నరేష్, బండి రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి


మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శ్రీవాణి

సూర్యాపేటటౌన్ : విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా కోర్టు సీనియర్ సివిల్ జడ్జి శ్రీవాణి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో చట్టాలపై విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. విద్యార్థులు కళాశాలలో సోదరభావంతో మెలగాలన్నారు. విద్యార్థినులకు ఇబ్బందులు ఉంటే ఉపాధ్యాయులకు, షీ టీంకు ఫిర్యాదు చేయాలన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడితే చట్టపరంగా కఠిన శిక్షలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో అదనపు జూనియర్ సివిల్ జడ్జి ప్రశాంతి, న్యాయవాదులు శశిధర్, నర్సయ్య యాదవ్, వసంత సత్యనారాయణపిళ్లై, మారపాక వెంకన్న, అశోక్, ప్రిన్సిపల్ యాదయ్య పాల్గొన్నారు.

మట్టపల్లిలో నిత్యకల్యాణం

మఠంపల్లి : మట్టపల్లి ఆలయంలో శ్రీలక్ష్మీనృసింహస్వామి నిత్య కల్యాణాన్ని శనివారం అర్చకులు వేదమంత్రాలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, నిత్యఅగ్నిహోత్రి, మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం చేశారు. శ్రీలక్ష్మీనరసింహస్వామి, రాజ్యలక్ష్మి, చెంచులక్ష్మి అమ్మవార్లకు అష్టోత్తర, సహస్ర కుంకుమార్చనలు గావించారు. స్వామిఅమ్మవార్లను పట్టు వస్త్రాలతో వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవ సంవాదం రక్తికట్టించారు. అనంతరం విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, మధుపర్క పూజ, మాంగల్యధారణ నిర్వహించారు. కార్యక్రమంలో విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, నవీన్, కృష్ణమాచార్యులు, పద్మనాబాచార్యులు, బదరీనారాయణాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు భక్తులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల నిరసన

కోదాడ అర్బన్: ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసేందుకు తీసుకువచ్చిన బిల్లును గవర్నర్‌కు పంపగా ఆమోదించకపోవడంతో ఆర్టీసీ కార్మికులు శనివారం కోదాడ డిపో గేటు ముందు రెండు గంటల పాటు నిరసన వ్యక్తం చేశారు. బిల్లును ఆమోదించాలని కార్మికులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ కార్మికులు జీఎంరావు, అబ్దుల్, శ్రీకళ, ఉప్పలయ్య, భాగ్యరావు, రామ్మూర్తి, గురులక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


కోదాడ డిపో గేటు ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఆర్టీసీ కార్మికులు

కమలం వికసించేనా!

ఉమ్మడి జిల్లాలో బీజేపీ ఆశలు ఫలించేనా..

- రాష్ట్ర వ్యాప్తంగా పార్టీని బలోపేతం చేసేందుకు కసరత్తు
- సీనియర్లంతా అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధం కావాలని అధిష్టానం ఆదేశం
- ఈ నెల 20 నుంచి చేపట్టబోయే పర్యటనలతో ప్రయోజనమెంత?



భారతీయ జనతా పార్టీ.. సంస్థాగతంగా బలోపేతం అయ్యేందుకు అనేక పాట్లు పడుతోంది. ముఖ్యంగా ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పార్టీని బలోపేతం చేయడం అంత సులభం కాదన్న వాదనలు వినిపిస్తున్నాయి. జిల్లాలోని నేతలు ఎవరికి వారే అన్నట్టుగా ఉండటం, క్షేత్ర స్థాయిలో కార్యకర్తల సమస్యలను తీర్చడంపై శ్రద్ధ చూపకపోవడం, అందుకు అయ్యే ఖర్చుకు వెనుకాడుతుండటం వంటి కారణాలు పార్టీ బలోపేతానికి అడ్డుగా మారుతున్నాయనే అభిప్రాయం పార్టీ శ్రేణుల నుంచే వ్యక్తమవుతోంది.

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: అసెంబ్లీ ఎన్నికల్లో సీనియర్లు అంతా పోటీలో ఉండేందుకు సిద్ధం కావాలని, రాష్ట్రంలో పార్టీని అధికారంలోకి తీసుకురావాలని, ఈ నెల 20 నుంచి అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో సమావేశాలు నిర్వహించాలని ఇటీవల ఢిల్లీలో ఎంపీలతో జరిగిన సమావేశంలో బీజేపీ అధిష్టానం ఆదేశాలు జారీ చేసింది. అయితే, ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఇది ఎంతవరకు సక్సెస్ అవుతుందనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. జాతీయ, రాష్ట్ర స్థాయిలో పార్టీ ఆలోచన ఒక తీరుగా ఉంటే ఉమ్మడి జిల్లాలో వాస్తవ పరిస్థితులు మరోలా ఉన్నాయి. రాష్ట్ర పార్టీ పిలుపు ఇచ్చిన కార్యక్రమాలను సక్సెస్ చేయడంలోనూ జిల్లా నేతలు వెనుకంజలో ఉన్నట్లు ఆ పార్టీ రాష్ట్ర నాయకులే చెబుతున్నారు. పైగా పార్టీ కోసం గట్టిగా నిలబడి పనిచేసే నాయకులు రెండు మూడు నియోజకవర్గాల్లో మినహా మిగతా చోట్ల లేరన్న వాదన ఉంది. తెలంగాణ వచ్చాక ఉమ్మడి జిల్లాలో ఒక్క చోట కూడా పార్టీ అభ్యర్థి విజయం సాధించలేదు. పార్టీ రాష్ట్ర అధ్యక్షునిగా బండి సంజయ్ పగ్గాలు చేపట్టిన తరువాత పార్టీకి ఊపును తేగలిగారు. మునుగోడు ఉప ఎన్నికలో నువ్వా.. నేనా అన్నట్లుగా బీజేపీ, బీఆర్ఎస్ తలపడ్డాయి. అయినా కమలం పార్టీ గెలువలేకపోయింది. పార్టీకి వచ్చిన ఊపును.. కొత్త అధ్యక్షుడిగా కిషన్‌రెడ్డి వచ్చిన తరువాత కొనసాగించడంలో ఉమ్మడి జిల్లాలోని నేతలు ఎంతమేరకు సక్సెస్ అవుతారు, సంస్థాగతంగా పార్టీని ఏ మేరకు బలోపేతం చేస్తారన్నది వారి కార్యాచరణను బట్టే ఉండనుంది.

మునుగోడు మినహా మిగతా చోట్ల అంతంతే..


- మునుగోడు నియోజకవర్గంలో తప్ప బీజేపీకి ఏ నియోజకవర్గంలోనూ పెద్దగా పట్టు లేదు. కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి బీజేపీలో చేరి మునుగోడు ఉప ఎన్నికలో పోటీ చేసిన విషయం తెలిసిందే. ఉప ఎన్నికల్లో ఓడిపోయినా సాధారణ ఎన్నికలో మాత్రం రాజగోపాల్‌రెడ్డి బీజేపీ నుంచి పోటీ చేస్తే విజయం సాధిస్తారనే చర్చ సాగుతోంది.
- నాగార్జునసాగర్ నియోజకవర్గంలో పార్టీ పరిస్థితి అంతంతమాత్రంగానే ఉంది. పార్టీ జిల్లా అధ్యక్షుడు కంకణాల శ్రీధర్‌రెడ్డి సతీమణి నివేదితరెడ్డి 2018 ఎన్నికల్లో పోటీ చేసినా పెద్దగా ఓట్లు రాలేదు. పార్టీ నుంచి పోటీ చేసేందుకు ఆశావహులు ఉన్నా పెద్దగా అక్కడ వర్కవుట్ కాదనే వాదన పార్టీ వర్గాల్లోనే ఉంది.
- దేవరకొండ నియోజకవర్గంలోని పీఏపల్లి మినహా దేవరకొండ, చందంపేట, చింతపల్లి, మల్లేపల్లి, డిండి మండల కేంద్రాల్లో కొంత మేరకు బీజేపీ కేడర్ ఉంది. గత ఎన్నికల్లో పోటీ చేసిన కల్యాణ్‌నాయక్, కేతావత్ లాలూనాయక్ టికెట్ ఆశిస్తున్నా కాంగ్రెస్, బీఆర్ఎస్‌ను ఢీకొనే పరిస్థితి కనిపించడం లేదు.
- మిర్యాలగూడలో బీఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యేను ఢీకొనే పరిస్థితి కనిపించడం లేదు. అక్కడి నుంచి టికెట్ ఆశించే నేతలు గానీ, పార్టీ బలోపేతానికి చేపడుతున్న చర్యలు గానీ పెద్దగా లేవు.
- నకిరేకల్ నియోజకవర్గంలో పార్టీ నామమాత్రంగానే ఉంది. పార్టీని అభివృద్ధిలోకి తీసుకురాగలిగే పరిస్థితి పెద్దగాకనిపించడం లేదు.
- హుజూర్‌నగర్ నియోజకవర్గంలో పార్టీకి ఉన్న పట్టు అంతంతే. పార్టీ సూర్యాపేట బీజేపీ అధ్యక్షుడు బొబ్బ భాగ్యరెడ్డి లేదంటే గట్టు శ్రీకాంత్‌రెడ్డి పోటీ చేస్తారని భావిస్తున్నా, అక్కడ బీఆర్ఎస్ కాంగ్రెస్ బలంగా ఉన్నాయి.
- తుంగతుర్తిలో బీజేపీ పరిస్థితి నామమాత్రమే. గత ఎన్నికలో పోటీ చేసిన కడియం రామచంద్రయ్య క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నా బీఆర్ఎస్‌కు దీటుగా నిలిచే పరిస్థితి లేదు.
- కోదాడ నియోజకవర్గంలోనూ పార్టీ నామమాత్రంగానే ఉంది. ఉన్న నాయకులు ఎవరికి వారే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు.
- ఆలేరు నియోజకవర్గంలో పట్టణ ప్రాంతాల్లోనే బీజేపీ మెరుగ్గా ఉన్నా గ్రామీణ ప్రాంతాల్లో పెద్దగా లేదు. బీఆర్ఎస్ నుంచి బీజేపీలో చేరిన మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పడాల శ్రీనివాస్, ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసిన సూదగాని హరిశంకర్‌గౌడ్ కొత్తగా పార్టీలో చేరినవారే.
- భువనగిరిలో పార్టీ సీనియర్ నేత గూడూరు నారాయణరెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు పీవీ శ్యాంసుందర్‌రావు వంటి నేతలు పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నా, బీఆర్ఎస్‌ను ఢీకొనే స్థాయికి చేరతారా? లేదా? అన్నది తేలాల్సి ఉంది.

- నల్లగొండ నియోజకవర్గంలో 2018 అసెంబ్లీ ఎన్నికల్లో తక్కువ ఓట్లే వచ్చినా పార్లమెంట్ ఎన్నికల్లో మాత్రం ఓటింగ్ శాతం కొంత పెరిగింది. ప్రస్తుతం బీజేపీ నుంచి మాదగోని శ్రీనివాస్‌గౌడ్, కన్మంత్‌రెడ్డి శ్రీదేవిరెడ్డి పోటీ విషయంలో ముందువరుసలో ఉన్నారు. నాగం వర్షిత్‌రెడ్డి కూడా ఆశిస్తున్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండు పార్టీలే ఇక్కడ బలంగా ఉన్నాయి. వాటికి దీటుగా పార్టీని ఎలా ప్రజలకు దగ్గర చేస్తారో చూడాలి.

- సూర్యాపేట నియోజకవర్గంలో పార్టీకి ఆశించిన స్థాయిలో పట్టు కనిపించడం లేదు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర్‌రావు.. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్తున్నారు. గత ఎన్నికల్లో రెండుసార్లు పోటీ చేసి ఓడిపోయినా నియోజకవర్గంలో పార్టీ కోసం పని చేస్తున్నారు. అయినా బీఆర్ఎస్, కాంగ్రెస్‌తో బీజేపీ విస్తరణలో పోటీ పడలేకపోతోంది.

రెండు గేట్ల ద్వారా మూసీ నీటి విడుదల

కేతేపల్లి: జిల్లాలో నాగార్జునసాగర్ తర్వాత అతిపెద్ద సాగునీటి వనరుగా ఉన్న మూసీ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. దీంతో అధికారులు శనివారం రెండు క్రస్టు గేట్లను అడుగు మేర పైకెత్తి దిగువకు 1,180 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఎగువ నుంచి మూసీకి 2,945 క్యూసెక్కుల వరద నీరు వస్తుంది. ప్రాజెక్టు గరిష్ట నీటిమట్టం 645 అడుగులు కాగా నీటిమట్టం 643.30 అడుగుల వద్ద ఉంది. కుడి, ఎడమ ప్రధాన కాల్వల ద్వారా ఆయకట్టు భూములకు 546 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. మూసీ రిజర్వాయర్‌లో పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 4.46 టీఎంసీలు కాగా ప్రస్తుతం 4.02 టీఎంసీల నీరు నిల్వ ఉందని అధికారులు తెలిపారు. ఇప్పటి వరకు ప్రాజెక్టు నుంచి గేట్ల ద్వారా 16.70 టీఎంసీల నీటిని దిగువకు విడుదల చేశామని పేర్కొన్నారు.


మూసీ ప్రాజెక్టు నుంచి దిగువకు పోతున్న నీరు

స్నేహం.. ఒక గొప్ప వరం

- స్నేహం మరుపురాని మధురానుభూతి
- కష్టంలో తోడుండే వాడే నిజమైన స్నేహితుడు
- కలెక్టర్ వెంకట్రావు



దురాజ్‌పల్లి (సూర్యాపేట) : ‘సృష్టిలో అమ్మ అనే పదం తర్వాత ఆత్మీయతను ధ్వనింపజేసే ఏకైక పదం స్నేహం.. స్నేహం దేవుడిచ్చిన ఒక గొప్ప వరం’ అని కలెక్టర్ ఎస్. వెంకట్రావు తెలిపారు. స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని శని వారం ఆయన సాక్షితో మాట్లాడారు. వివరాలు ఆయన మాటాల్లోనే.. స్నేహం ఒక మరుపురాని, చెప్పటానికి మాటలులేని మధురానుభూతి. స్నేహానికన్న మిన్న లోకాన లేదురా.. అన్నది అక్షర సత్యం. అమ్మా, నాన్న, అక్క, తమ్ముడు, అన్నా, చెల్లెలు కడదాక వస్తారో లేదో తెలియదు కానీ, దోస్త్ మాత్రం చివరి వరకు తోడుంటాడు. అలాంటి స్నేహితులను ఎంపిక చేసుకునే బాధ్యత మాత్రం నీదే. ఎందుకంటే అమ్మ, నాన్న, అక్క, చెల్లెలు, తమ్ముడు, అన్నలను ఆ దేవుడు రక్తసంబంధం రూపంలో ఇస్తే, మంచి స్నేహితును సంపాదించుకునే బాధ్యత నీ పైనే ఉంచాడు. కష్టంలో తోడుండేవాడే నిజమైన స్నేహితుడు. భార్య, బిడ్డలతో కూడా చెప్పుకోలేని ఎన్నో విషయాలను స్నేహితుడితో చెప్పుకోగలం. అలాంటి స్నేహితుడు ఒక్కడున్నా చాలనుకుంటాం. ఇలాంటి స్నేహితులు మరికొంతమంది ఉంటే అది స్నేహితుల కుటుంబం అవుతుంది. ఈ భూమి మీదికి నువ్వు ఒంటరిగా వచ్చినప్పటికీ వెళ్లేటప్పుడు మాత్రం ‘జగమంతా నీ కుటుంబం అవుతుంది’. నేను మరిచిపోలేని మిత్రులు చాలా మంది ఉన్నారు. ముఖ్యంగా రమేష్ (ఐటీడీఏ ఏఈ), శ్రీనివాస్ (ట్రేడర్), చంద్ర (సెల్ఫ్ ఎంప్లాయ్‌మెంట్), మల్లికార్జున్ (ఐటీ), సోమేశ్వర్ (ల్యాబ్ టెక్నీషియన్), విశ్వేశ్వర్ (బిజినెస్) మంచి మిత్రులు. ఏ కార్యక్రమం ఉన్నా అందరం కలిసి కష్టసుఖాలను పంచుకుంటాం.


తన కుమారుడి వివాహంలో స్నేహితులతో కలెక్టర్ వెంకట్రావు

విధుల నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు

నూతనకల్: విధుల నిర్వహణలో అలసత్వం వహించే వారిపై చర్యలు తప్పవని అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి హెచ్చరించారు. శనివారం తిరుమలగిరి మండల పరిధిలోని ఎర్రపహాడ్‌లో అంగన్‌వాడీ కేంద్రం, హెల్త్‌సెంటర్, జెడ్పీ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలల్లో మౌలిక వసతులు, తరగతి గదులతో పాటు రికార్డులు, విద్యార్థుల హాజరు శాతం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించాలన్నారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు వైద్య సిబ్బంది సకాలంలో వైద్యసేవలు అందించాలని ఆయన ఆదేశించారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ సత్యనారాయణగౌడ్, ఎంపీటీసీ రజిత లింగరాజు, ఆర్ఐ సుప్రజ, ప్రధానోపాధ్యాయుడు మల్లు ఉపేందర్‌రెడ్డి పాల్గొన్నారు.


అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి

రెండవ ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్ చేయాలి



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఏఎన్‌ఎంలు, నాయకులు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : పీహెచ్‌సీలలో పనిచేస్తున్న రెండవ ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్ చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం కలెక్టరేట్ ఎదుట రెండో ఏఎన్‌ఎంలు నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు.జూలై 26న రాష్ట్ర ప్రభుత్వం 1,521 రెండవ ఏఎన్‌ఎం పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసిందని, కానీ ఇప్పటికే విధులు నిర్వహిస్తున్న రెండవ ఏఎన్‌ఎంలకు ఎలాంటి పరీక్షలు లేకుండా రెగ్యులరైజ్ చేయాలని కోరారు. అనంతరం ఏఓ శ్రీదేవికి వినతి పత్రం అందించారు. ఈ ధర్నాలో ఏఎన్‌ఎంల సంఘం నాయకురాలు లక్ష్మీబాయి, స్వప్న, విజయ, శిరోమణి, రమాదేవి, నీరజ, సరిత పాల్గొన్నారు.

ట్రెండ్ మారినా.. ఫ్రెండ్ మారడు..

- ఫ్రెండ్‌షిప్‌లోనే ఆనందం
- ఫ్రెండ్‌షిప్ పేరుతో మోసం చేయకూడదు
- అవసరం కోసమే స్నేహం చేయొద్దు
- ‘సాక్షి’ ఆధ్వర్యంలో నిర్వహించిన టాక్ షోలో ఎస్వీ ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థులు




సూర్యాపేటలోని ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన టాక్‌షోలో పాల్గొన్న విద్యార్థులు

సూర్యాపేటటౌన్ : ‘ఫ్రెండ్‌షిప్‌తోనే జీవితంలో నిజమైన ఆనందం ఉంటుంది.. ఒక మంచి ఫ్రెండ్ ఉంటే ఎంత పెద్ద సమస్యకైనా పరిష్కారం దొరుకుతుంది.. ఫ్రెండ్‌తో ఏదైనా షేర్ చేసుకోవచ్చు’ అని అంటున్నారు ఇంజనీరింగ్ విద్యార్థులు. ఫ్రెండ్‌షిప్ డేను పురస్కరించుకుని ‘ఫ్రెండ్ ఎలా ఉండాలి.. ఆన్‌లైన్ ఫ్రెండ్‌షిప్‌లో నిజాయితీ ఎంత.. మీ ఫ్రెండ్ కోసం మీరు ఏం చేశారు.. మీ ఫ్రెండ్ నుంచి ఏమి ఆశిస్తున్నారు’ అనే అంశాలపై శనివారం జిల్లా కేంద్రంలోని ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో సాక్షి ఆధ్వర్యంలో నిర్వహించిన టాక్ షోలో పలువురు విద్యార్థులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ‘ట్రెండ్ మారినా.. ఫ్రెండ్ మారడు.. ఇటీవల సోషల్ మీడియాలో ఫ్రెండ్స్ ఎక్కువవుతున్నారు. అవసరం కోసం ఫ్రెండ్‌షిప్ చేస్తున్నారు అలాంటివాటిని నమ్మొద్దు’ అని పేర్కొంటున్నారు. వివరాలు వారి మాటల్లోనే..

ఎక్కడైనా ఫ్రెండ్‌షిప్ చేయొచ్చు


మనం మన జీవితంలో స్కూల్ లైఫ్‌లో, కళాశాల లైఫ్‌లో, ఉద్యోగం చేసే సమయంలో ఇలా ఎక్కడైనా ఫ్రెండ్‌షిప్ చేయొచ్చు. ఎక్కడైనా ఫ్రెండ్ ఉంటే ప్రతీది డిస్కస్ చేసుకోవచ్చు. నీతి నిజాయితీ, నిబద్ధతతో ఉండాలి. మనం ఎంత ఎత్తుకు ఎదిగినా ఫ్రెండ్స్‌ను మరువకూడదు.

– కావ్య, ఇంజనీరింగ్ విద్యార్థిని

ప్రతి విషయం పంచుకునేవాడే..


నిజమైన స్నేహమంటే ఒకరినొకరు మోసం చేసుకోకుండా ప్రతి విషయాన్ని తనతో పంచుకునేవాడే నిజమైన స్నేహితుడు. అన్నదమ్ములకు, అక్కాచెల్లెళ్లకు కూడా చెప్పుకోలేని కొన్ని విషయాలను ఒక్క ఫ్రెండ్‌తో మాత్రమే చెప్పుకోగలుగుతాం. అలాంటి స్నేహితుడు ఉన్నప్పుడు హ్యాపీగా ఉండగలం.

– మహేష్, ఇంజనీరింగ్ విద్యార్థి

ఏ సమస్య అయినా ఫ్రెండ్‌తో చెప్పుకోవచ్చు


నిజమైన ఫ్రెండ్ ఉంటే తల్లిదండ్రులతో కూడా చెప్పులేనివి ఫ్రెండ్స్‌తో చెప్పుకోవచ్చు. ఏ ప్రాబ్లమ్ వచ్చినా ఫ్రెండ్స్ వెనుక ఉండి ఎంకరేజ్ చేస్తే పరిష్కరించుకోవచ్చు. ఫ్రెండ్‌షిప్‌కు ఒక గౌరవం ఉంటుంది. అలాంటి గౌరవాన్ని ఎవరూ ఫ్రెండ్‌షిప్ పేరుతో మోసం చేసి నమ్మకాన్ని పోగొట్టుకోవద్దు.

– ప్రీతి, ఇంజనీరింగ్ విద్యార్థిని

ఆన్‌లైన్ ఫ్రెండ్‌షిప్‌ను నమ్మొద్దు


ప్రస్తుతం సోషల్ మీడియాలో భాగంగా ఇన్‌స్టాగాం, ఫేస్‌బుక్‌లలో ఫ్రెండ్స్ ఎక్కువవుతున్నారు. అలాంటి ఆన్‌లైన్ ఫ్రెండ్‌షిప్‌ను గుడ్డిగా నమ్మొద్దు. నిజమైన ఫ్రెండ్ ఉంటే మనం ఏదైనా తప్పు చేస్తే అది తప్పు అలా చేయకూడదని నిజాయితీగా చెప్పేవాడే.

– రీతిక, ఇంజనీరింగ్ విద్యార్థిని

ఆన్‌లైన్ ఫ్రెండ్‌షిప్‌లో బాధలు చెప్పుకోలేం


ఆన్‌లైన్‌లో ఫ్రెండ్‌షిప్ చేస్తే మన బాధలు ఏమీ చెప్పుకోలేం. అదే మన క్లాస్‌మేట్, లేకపోతే కళాశాలలో ఉండే వారితో స్నేహం చేస్తే రోజూ మనకు ఎలాంటి సమస్య వచ్చినా చెప్పుకోవచ్చు. అలాగే ప్రతి రోజూ కలుసుకోవచ్చు.

– సాయిదేవ్, ఇంజనీరింగ్ విద్యార్థి

ఆపదలో ఆదుకునేవాడే నిజమైన ఫ్రెండ్


మనకు ఏదైనా ఆపద వస్తే వెంటనే మనదగ్గర ఉండేవాడే నిజమైన ఫ్రెండ్. అలాంటి వారు ఈ రోజుల్లో దొరకడం చాలా కష్టం. నీతినిజాయితీ గల స్నేహం దొరికితే వారు అదృష్టవంతులే. ఎల్లవేళలా మనతోనే ఉండాలి.

– మహేష్, ఇంజనీరింగ్ విద్యార్థి

అవసరానికి వాడుకునే స్నేహం చేయొద్దు


ప్రస్తుతం ఉన్న సమాజంలో కొంత మంది అవసరం కోసమే ఫ్రెండ్‌షిప్ చేస్తున్నారు. అలాగే అవసరానికి వాడుకునే స్నేహం ఎప్పుడూ చేయొద్దు. అవసరానికి వాడుకుని నమ్మక ద్రోహం చేస్తున్నారు. అలాంటి స్నేహం చేయకపోడమే మంచిది. అందరినీ గుడ్డిగా నమ్మొద్దు. నీతి నిజాయితీతో స్నేహం చేయాలి.

– సాయి కీర్తన, ఇంజనీరింగ్ విద్యార్థిని

ఫ్రెండ్‌కోసం ఏదైనా చేస్తా


నాకు ఫ్రెండ్స్ చాలా మంది ఉన్నారు. నా ఫ్రెండ్ కోసం ఏదైనా చేస్తా. అవసరమైతే పరీక్షల సమయంలో సమయం దాటినా ఫ్రెండ్ వచ్చే వరకు వెయిట్ చేస్తా. నా ఫ్రెండ్స్ అంటే అంత ఇష్టం. ఫ్రెండ్ కోసం ఏదైనా చేయగలిగేవాడే ఫ్రెండ్‌షిప్ చేయాలి.

– రవి, ఇంజనీరింగ్ విద్యార్థి

ఫ్రెండ్ పేరుతో మోసం చేయొద్దు


ఫ్రెండ్‌షిప్ పేరుతో ఎవరిని మోసం చేయొద్దు. అలా మోసం చేసేటోన్ని ఎవరూ ఎప్పుడూ నమ్మరు. ఫ్రెండ్‌షిప్ చేస్తే నీతి నిజాయితీ ఉండాలి. ఎప్పుడూ సంతోషంగా ఉండాలంటే జీవితంలో ఒక మంచి బెస్ట్ ఫ్రెండ్ ఉండాలి.

– కార్తీక్, ఇంజనీరింగ్ విద్యార్థి

నేస్తం.. సమస్తం





విచిత్రమైన బంధం.. విలువైన అనుబంధం స్నేహం. ఎలా పుడుతుందో తెలియదు.. ఏళ్లు గడిచినా మరువదు. అర్హత చూసి దరి చేరదు.. అనర్హత చూసి దూరం కాదు స్నేహ బంధం. సంతోషాన్ని అయినా.. విషాదాన్ని అయినా పంచుకునేది స్నేహితుల దగ్గరే. స్నేహం లేని ప్రపంచం.. పువ్వులేని తోట.. గమనం లేని బాణం ఎంతోకాలం నిలువదు అంటుంటారు. అలాంటి స్నేహం విలువ వెలకట్టలేనిది. నేడు ఫ్రెండ్‌షిప్ డే సందర్భంగా ప్రత్యేక కథనాలు..

నల్లగొండలో ఫ్రెండ్‌షిప్‌డే సెలబ్రేషన్స్‌లో విద్యార్థినులు



పైయిడిమర్రి నారాయణరావు, ఎండీ.షరీఫ్

వ్యాపారంతో ఒక్కటిగా..

కోదాడ : చిన్నతనంలో చిగురించిన వారి స్నేహం నాలుగు దశాబ్దాలుగా కొనసాగుతోంది. విద్యార్థులుగా, వ్యాపార భాగస్వాములుగా వారి స్నేహం కుల మతాలకు అతీతంగా నిలిచి ఉంది. తాము చేస్తున్న వ్యాపారానికి 'ఆదర్శం' అని పేరు పెట్టుకోవడం ఆలోచింపజేస్తుంది. వారే కోదాడకు చెందిన పైయిడిమర్రి నారాయణరావు, ఎండీ షరీఫ్. నారాయణరావుది కోదాడ కాగా ఎండీ.షరీఫ్‌ది గుడిబండ. వీరిద్దరూ కోదాడ ప్రభుత్వ పాఠశాలలో ఆరో తరగతి నుంచి సహ విద్యార్థులు. చదువు పూర్తయిన తరువాత ఇద్దరు కలసి కోదాడలోని బొడ్రాయి బజార్‌లో 1987లో ఆదర్శ మెడికల్స్ పేరుతో వ్యాపారాన్ని ప్రారంభించారు. అప్పటి నుంచి 36 సంవత్సరాలుగా ఎలాంటి భేదాభిప్రాయాలు లేకుండా వ్యాపారాన్ని నిర్వహించుకుంటున్నారు. ఇద్దరివి వేర్వేరు మతాలు అయినా వీరి స్నేహానికి అడ్డురాలేదు. పండుగలు, పర్వదినాల్లో ఒకరి ఇంటికి మరొకరు వెళుతూ స్నేహానికి మతాలతో సంబంధం లేదని నిరూపిస్తున్నారు. ఒకరి అభిప్రాయాలను మరొకరు గౌరవించుకోవడమే తమ స్నేహబంధానికి కారణమని చెపుతున్న ఈ స్నేహితులకు స్నేహితుల దినోత్సవ శుభాకాంక్షలు తెలపకుండా ఉండగలమా..!

ఆపదలో అండగా..



ఆర్థికసాయం అందజేస్తున్న యువకులు (ఫైల్)

మునుగోడు : తమ స్నేహితులు ఏదైనా ఆపదలో ఉన్నారని తెలిసిన వెంటనే అందరూ స్పందించి తమ శక్తి మేరకు సహాయ సహకారాలు అందిస్తున్నారు మునుగోడు గ్రామపంచాయతీ పరిధిలోని లక్ష్మీదేవిగూడెం గ్రామానికి చెందిన యువకులు. ఆ గ్రామానికి చెందిన 45 మంది యువకులు తమలో ఎవ్వరికి ఏ కష్టం వచ్చినా ఆ వ్యక్తికి అండగా నిలబడాలని నిర్ణయించుకున్నారు. 2008లో శివాజీ యువజన సంఘం ఏర్పాటు చేసుకుని.. తమ సంఘంలో కొంత నగదు నిల్వ ఉంచుతున్నారు. తమ స్నేహితుల్లో ఎవరికి ఆపద వచ్చినా మేమున్నామంటూ ఆర్థికంగా అండగా నిలుస్తున్నారు. 12 ఏండ్ల కాలంగా వారు రూ.5 లక్షలకు పైగా ఆర్థిక సాయం అందజేశారు. స్నేహితులు అంటే ఇలా ఉండాలని అనేలా మన్ననలు పొందుతున్నారు.

స్నేహితుల కుటుంబాలకు ఆసరాగా..



రాము కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందిస్తున్న మిత్రులు(ఫైల్)

నిడమనూరు : చుట్టుపక్కల గ్రామాలకు చెందిన వారు స్నేహితులయ్యారు. తమ స్నేహాన్ని ఎల్లకాలం నిలుపుకునేందుకు ఆపదలో ఉన్న స్నేహితులకు అండగా ఉంటున్నారు. నిడమనూరు మండలంలోని నిడమనూరు, బంకాపురం, తుమ్మడం గ్రామాలకు చెందిన పున్నా శంకర్, వెంకన్న, రాము, శ్రీను, కొండల్, రాంబాబు, శశి, జానయ్య స్నేహితులు బంకాపురం గ్రామానికి చెందిన సింగరాల శశికుమార్ (24) అనారోగ్యంతో మృతి చెందాడు. అవివాహితుడు కావడంతో శశికుమార్ తల్లిదండ్రులకు స్నేహితులు రూ.30 వేలు అందించారు. స్నేహితుల్లో ఒకరైన తుమ్మడం గ్రామానికి చెందిన కొయ్య రాము మార్చి నెలలో కాలువలో పడి మృతి చెందాడు. రాము కుటుంబానికి రూ.లక్షా 70 వేలు అందజేశారు. ఆపదలో ఉన్న స్నేహితుల కుటుంబాలకు అండగా నిలబడుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

అండగా.. ఆల్ మై ఫ్రెండ్స్

దేవరకొండ : ఆల్ మై ఫ్రెండ్స్.. ఆ పేరులోనే ఉంది అందరూ నా స్నేహితులే అనే అర్థం. ఈ పేరుకు తగ్గట్టే వారంతా ఒక వాట్సప్ గ్రూప్ ఏర్పాటు చేసుకొని తమ స్నేహితులకు తోచిన సహాయ సహకారాలు అందిస్తూ ముందుకు సాగుతున్నారు. దేవరకొండ జెడ్పీహెచ్‌ఎస్ 1989–1990 బ్యాచ్‌కు చెందిన 84 మంది పదో తరగతి విద్యార్థులు ఆల్ మై ఫ్రెండ్స్ పేరిట 2015లో వాట్సప్ గ్రూప్ ఏర్పాటు చేసుకున్నారు. వీరిలో కొంతమంది విదేశాలతో పాటు వివిధ పట్టణాల్లో స్థిరపడ్డారు. తమతో పాటు చదువుకున్న స్నేహితులకు ఆర్థికపరమైన ఇబ్బందులు, ఆపద సమయాల్లో అండగా నిలుస్తున్నారు. మొదట్లో గ్రూప్ సభ్యులకు సహాయ సహకారాలు పరిమితం కాగా ప్రస్తుతం విస్తృతమయ్యాయి. గతేడాది దేవరకొండకు చెందిన శ్రీకాంత్ పేగు సంబంధిత వ్యాధితో బాధపడుతూ వైద్య సాయం కోసం ఎదురుచూస్తున్న క్రమంలో విదేశాల్లో ఉన్న గ్రూప్ సభ్యుడైన నల్లమాద దేవేందర్‌రెడ్డి.. విదేశాల్లో స్థిరపడిన తన స్నేహితుల ద్వారా సమకూర్చిన రూ.5.30 లక్షలు అందించి తమ ఉదారతను చాటుకున్నారు. అంతేకాకుండా ఇటీవల తమ స్నేహితుడైన కర్నాటి ఆంజనేయులు అనారోగ్యానికి గురికావడంతో గ్రూప్ సభ్యులందరూ కలిసి రూ.లక్ష ఆర్థిక సాయంగా అందజేశారు. గతేడాది తమ స్నేహితుడైన కృష్ణమాచారి అనారోగ్యంతో మృతి చెందడంతో అతని కుటుంబానికి అండగా నిలిచి గ్రూప్ సభ్యులు రూ.1.80 లక్షలు అందజేశారు. రానున్న రోజుల్లో తమ సేవలను మరింత విస్తృతం చేసేందుకు వారంతా ముందుకు సాగుతున్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న స్నేహితులు (ఫైల్)

ఓపెన్ ఐస్ సొసైటీ సాయం



మిత్రుడి కుటుంబ సభ్యులకు సాయం అందజేస్తున్న స్నేహితులు (ఫైల్)

హుజూర్‌నగర్ : ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు ఒక్కటయ్యారు హుజూర్‌నగర్‌కు చెందిన మిత్రులు. ఓపెన్‌ఐస్ సొసైటీ ఏర్పాటు చేసి సొంతంగా కొంత సొమ్మును జమ చేసి పేదలకు సాయం చేయడం ప్రారంభించారు. వారికి మరి కొందరు మిత్రులు తోడయ్యారు. హుజూర్‌నగర్‌లో రెండేళ్లక్రితం అనారోగ్యంతో మృతి చెందిన బాలబోయిన వెంకన్న కుటుంబానికి రూ.3.10 లక్షలు అందజేశారు. గత ఏడాది చనిపోయిన వీసం మధు కుటుంబ సభ్యులకు రూ.లక్ష అందజేశారు. అరుదైన వ్యాధితో బాధపడుతున్న బైరం వెంకయ్య వైద్య ఖర్చుల కోసం రూ. లక్ష అందజేశారు. కాలేయ వ్యాధితో బాధపడుతూ ఐసీయూలో ఉండి చికిత్స పొందుతున్న అరుణ్‌కుమార్ రూ.50 వేల ఆర్థిక సాయం అందజేసారు. అంతే కాకుండా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నోట్ బుక్స్, ఉత్తమ ఫలితాలు సాధించిన వారికి నగదు బహుమతులు అందజేస్తున్నారు. స్నేహితుల కోసం ఏర్పడిన సంఘం ఇతరులకు కూడా ఉపయోగకరంగా మారడంతో పలువురు వారిని అభినందిస్తున్నారు.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో రైతు మృతి



బుచ్చిరెడ్డి (ఫైల్)

చిట్యాల: విద్యుదాఘాతంతో ఓ రైతు మృతిచెందాడు. చిట్యాల మండలం ఏపూరు గ్రామానికి చెందిన ఎంపల్ల బుచ్చిరెడ్డి (55) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. బుచ్చిరెడ్డి రోజూ వారీగా శనివారం వ్యవసాయ భూమి వద్దకు వెళ్లాడు. పొలానికి నీరు పెట్టేందుకు బోరు మోటారు వద్దకు వెళ్లాడు. బోరుకు విద్యుత్‌ను సరఫరా చేసే వైరు కిందపడి ఉండగా బుచ్చిరెడ్డి దానికి మరమ్మతులు చేస్తున్నాడు. ఈ క్రమంలో వైరు ప్రమాదవశాత్తు బుచ్చిరెడ్డికి తగలడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు కుమార్తెలున్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చిట్యాల ఎస్ఐ ఇరుగు రవి తెలిపారు.

దాడి కేసులో ఇద్దరి రిమాండ్

నేరేడుచర్ల : దాడి కేసులో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్ఐ పచ్చిపాల పరమేష్ తెలిపారు. నేరేడుచర్ల ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఈనెల 3న రాత్రి వేముల మధుబాబు తన స్నేహితులతో కలిపి టిఫిన్ చేసేందుకు వెళ్లాడు. మున్సిపాలిటీ పరిధిలోని రాంపురానికి చెందిన చందమళ్ల నవీన్, అతడి స్నేహితుడి మణి వేరే వ్యక్తులు గొడవ పడుతుండగా మధుబాబు వారి వారించేందుకు ప్రయత్నించాడు. దీంతో నవీన్, మణిలు కలిసి మధుపై కత్తితో దాడి చేసి గాయపరిచారు. అక్కడే ఉన్న స్నేహితులు వెంటనే మధును స్థానిక ఆస్పత్రికి పంపించారు. ఈ దాడికి పాల్పడిన నవీన్, మణి పారిపోగా శనివారం కోదాడ ప్రాంతంలోని తొగర్రాయి వద్ద అరెస్ట్ చేసినట్లు తెలిపారు. షాపుల యాజమానులు రాత్రి 10గంటలకు దుకాణాలు మూసివేయాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా 100నంబర్‌కు సమాచారం అందించాలన్నారు.

యువకుడికి గాయాలు

కోదాడరూరల్ : రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన పట్టణ పరిధిలోని కొమరబండలో శనివారం చోటుచేసుకుంది. ఖమ్మంకు చెందిన మల్సూర్ అలీ కోదాడ నుంచి సూర్యాపేటవైపు వెళ్తుండగా ఎదురుగా వస్తున్న డీసీఎం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతడిని కోదాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అటునుంచి మెరుగైన చికిత్స నిమిత్తం ఖమ్మంకు తీసుకెళ్లారు. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని రూరల్ పోలీసులు తెలిపారు.

దివ్యాంగుడికి కిడ్నీ ఆపరేషన్ చేయిస్తాం

- పేద కుటుంబానికి ఆరోగ్యశ్రీ అధికారుల భరోసా



వివరాలు తెలుసుకుంటున్న ఆరోగ్యమిత్ర రమేష్

అర్వపల్లి: కిడ్నీలలో రాళ్లు ఏర్పడి ఇన్‌ఫెక్షన్‌తో రోజురోజుకూ క్షీణిస్తున్న ఆరోగ్యంతో బాధపడుతున్న జాజిరెడ్డిగూడెం మండలం అర్వపల్లికి చెందిన దివ్యాంగుడు వెంకన్న దీనగాథను 'నిరుపేదకు ప్రాణభిక్ష పెట్టరూ..' శీర్షికన 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి ఆరోగ్యశ్రీ అధికారులు స్పందించారు. ఆరోగ్యశ్రీ పథకం కింద ఆపరేషన్ చేయిస్తామని ముందుకొచ్చారు. వెంకన్న రెండు కిడ్నీలు పనిచేయక అనారోగ్యానికి గురికావడంతో ఆరోగ్యశ్రీ జిల్లా మేనేజర్ నాగరాజు, సూర్యాపేట డివిజన్ టీంలీడర్ పాండుల ఆదేశాల మేరకుఆరోగ్యమిత్ర ఎస్.రమేష్ శనివారం వెంకన్న ఇంటిని సందర్శించి వ్యాధి వివరాలు సేకరించారు. అనంతరం విషయాన్ని జిల్లా అధికారులకు తెలియజేయగా వెంకన్న ప్ర స్తుతం చికిత్స పొందుతున్న ఖమ్మంలోని కార్పొరేట్ ఆస్పత్రి వైద్యులతో మాట్లాడి ఉచితంగా ఆరోగ్యశ్రీలో ఆపరేషన్ చేయిస్తామని హామీ ఇచ్చారు. త్వరగా కిడ్నీల ఆపరేషన్ చేయించి తన కుమారుడిని బతికించాలని వెంకన్న తల్లి సోమమ్మ ఆరోగ్యశ్రీ అధికారులను వేడుకుంది.

సాక్షి ఎఫెక్ట్..

చెరువులో పడి వ్యక్తి మృతి

మేళ్లచెరువు : ప్రమాదవశాత్తు చెరువులో పడి ఓ వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మేళ్లచెరువు మండలకేంద్రానికి చెందిన జనిగ శంభయ్య(70) శుక్రవారం మధ్యాహ్నం ఇంటినుంచి బయటకు వెళ్లి రాత్రివరకు రాలేదు. శనివారం ఉదయం స్థానిక నాగుల చెరువులో స్థానికులు మృతదేహాన్ని గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో విషయం వెలుగులోకి వచ్చింది. శంభయ్య బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతిచెంది ఉండవచ్చని భావిస్తున్నారు. మృతుడి బంధువు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో బాలుడు మృతి

సూర్యాపేట రూరల్ : అనుమానాస్పదస్థితిలో ఓ బాలుడు మృతిచెందిన ఘటన సూర్యాపేట పట్టణ పరిధిలోని ఇందిరమ్మ ఫేస్ 3లో చోటు చేసుకుంది. ఇందిరమ్మ కాలనీకి చెందిన మచ్చ మధు కుమారుడు టైసన్ (6) సూర్యాపేట పబ్లిక్ స్కూల్లో ఫస్ట్ క్లాస్ చదువుతున్నాడు. మధు తన మొదటి భార్యను 2015లో కులాంతర వివాహం చేసుకున్నాడు. వీరిద్దరికి టైసన్ జన్మించాడు. మొదటి భార్య టైసన్‌ను మధు వద్ద వదిలి వెళ్లిపోయి వేరే పెళ్లి చేసుకున్నది. ప్రస్తుతం మధు, వాణి అనే అమ్మాయితో ఎంగేజ్మెంట్ చేసుకొని ఆమెతో సహజీవనం చేస్తున్నాడు. వారితో పాటు టైసన్ కూడా ఉంటున్నాడు. శుక్రవారం టైసన్‌ను స్కూల్‌లో వదిలివెళ్లిన తర్వాత సాయంత్రం 5.30గంటలకు ఇందిరమ్మ కాలనీలో తన ఇంటికి వచ్చాడు. టైసన్ కడుపులో నొప్పిగా ఉందని వాణితో చెప్పగా మధుకు ఫోన్ చేసి చెప్పింది. మధు ఇంటికి వచ్చి చూసేసరికి టైసన్ అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు.బాలుడిని తీసుకొని వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లాడు. అప్పటికే టైసన్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. టైసన్ గొంతుపై నలుపు రంగు మరకలు ఉండడంతో టైసన్ నాయనమ్మ కలమ్మ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సాయిరాం తెలిపారు.

కార్లను నెలవారీ అద్దెకు తీసుకుని విక్రయం

- పోలీసులకు చిక్కిన కేటుగాడు..
- 7కార్లు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న వాహనాలను పరిశీలిస్తున్న ఎస్పీ అపూర్వారావు

మిర్యాలగూడ అర్బన్: యజమానుల వద్ద కార్లను నెలవారీ అద్దెకు తీసుకుంటాడు.. నమ్మకంగా ఉంటూ వారికి తెలియకుండా కార్లను విక్రయించి జల్సాలు చేస్తున్న ఓ కేటుగాడిని పోలీసులు అరెస్టు చేశారు. శనివారం మిర్యాలగూడ పట్టణంలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నల్లగొండ ఎస్పీ అపూర్వారావు కేసు వివరాలు వెల్లడించారు. మిర్యాలగూడ పట్టణం అశోక్‌నగర్‌కు చెందిన షేక్ వాజిద్ నాలుగేళ్లుగా సెల్ఫ్ డ్రైవింగ్ పేరుతో కార్లను అద్దెకు ఇస్తుండేవాడు. కొంత మందితో నమ్మకం ఏర్పరుచున్న వాజిద్ వారి వద్ద నుంచి 20కార్లు నెలవారీ అద్దెకు తీసుకుని ఆ వాహనాలతో సెల్ఫ్ డ్రైవింగ్ పేరిట అద్దెకు ఇస్తూ ఆదాయం ఆర్జించేవాడు. ఈ క్రమంలో నెలవారీ అద్దెకు తీసుకున్న కార్లను ఏకంగా యజమానులకు తెలియకుండా విక్రయించి సొమ్ము చేసుకోవడం ప్రారంభించాడు. ఈ క్రమంలో ఓ కారు ఓనర్ తనకు తెలియకుండా విక్రయించాడని గుర్తించి పట్టణంలోని టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా అసలు విషయం బయటపడింది. దీంతో అతడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా ఈ విధంగా మొత్తం 9కార్లను హైదరాబాద్‌లోని అలకాపూర్‌కు చెందిన మధ్యవర్తి పోలూరి రాజు ద్వారా విక్రయించినట్లు అంగీకరించాడు. కాగా షేక్ వాజిద్ పై హైదరాబాద్‌లోని సరూర్‌నగర్, ఐఎస్ సదన్, ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషలోనూ ఇలాంటి కేసులు నమోదనైట్లు పోలీసులు గుర్తించారు. అతడి వద్ద నుంచి 7 కార్లను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ తెలిపారు. .

మరో కేసులో ఏడు బైక్‌లు స్వాధీనం


చోరీ కేసులో ఓ యువకుడిని పోలీసులు అరెస్ట్ చేసినట్లు ఎస్పీ తెలిపారు. మిర్యాలగూడ పట్టణంలోని ఇందిరమ్మకాలనీకి చెందిన గునగుంట్ల చరణ్ అలియాస్ చంటి బైక్ మెకానిక్‌గా పని చేస్తుండేవాడు. మద్యం, గంజాయికి బానిసగా మారి బైక్‌లను అపహరించి అవసరాలను తీర్చుకుంటున్నాడు. పట్టణంలోని ఈదులగూడలో శుక్రవారం సాయంత్రం వాహనాలను తనిఖీలు చేస్తున్న వన్‌టౌన పోలీసులకు తారసపడిన చరణ్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా బైక్‌లను అపహరిస్తున్నట్లు అంగీకరించాడు. చెన్నైలో రెండు , హుజూర్‌నగర్, నార్కట్‌పల్లి, తెనాలి, మిర్యాలగూడ వన్‌టౌన్, టూటౌన్ పరిధిలో ఒక్కో బైక్ చొప్పున చోరీ చేశానని చెప్పాడు. ఆ బైక్‌లను పట్టణంలోని గాంధీనగర్‌లో గల అరవిందా రైస్‌మిల్లు సమీపంలోని చెట్ల పొదల్లో దాచానని చెప్పాడు. దీంతో ఆ బైక్‌లను స్వాధీనం చేసుకుని చరణ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

శిశువును రక్షించిన పోలీసులు

15 రోజుల శిశువును పోలీసులు రక్షించారు.గత నెల 27న తెల్లవారుజామున ఓ మహిళ 15 రోజుల పాపను కొనుగోలు చేసి తీసుకుని వస్తుందని విశ్వసనీయ సమాచారంతో టూటౌన్ ఏఎస్ఐ వెంకటేశ్వర్లు, హెడ్‌కానిస్టేబుల్ బుచ్చిరెడ్డి, మహిళా కానిస్టేబుల్ ఆదెమ్మ, హోంగార్డు సర్దార్ మిర్యాలగూడలోని ఆర్టీసీ బస్టాండ్‌లో తనిఖీలు చేపట్టారు. ఓ మహిళ వద్ద రోజుల పాపను గుర్తించి ఆమెను విచారించారు. కొనుగోలు చేసి తెచ్చినట్లు గుర్తించిన పోలీసులు పాపను నల్లగొండలోని చైల్డ్ వెల్ఫేర్ సెంటర్‌కు తరలించారని ఎస్పీ తెలిపారు. శిశువు తల్లిదండ్రులను కూడా గుర్తించామని పేర్కొన్నారు. సమావేశంలో డీఎస్పీ వెంకటగిరి ఉన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా

- భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



నివాళులర్పిస్తున్న ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

కనగల్ : కార్యకర్తలకు అండగా ఉంటానని భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. కనగల్ మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు నర్సింగ్ జగతయ్య శుక్రవారం రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న కోమటిరెడ్డి శనివారం జగతయ్య ఇంటి వద్దకు వచ్చి కుటుంబ సభ్యులను పరామర్శించి కన్నీటి పర్యంతమయ్యాడు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు పరామర్శించి ధైర్యం చెప్పారు. జగతయ్య పార్థీవదేహాన్ని చూడగానే కోమటిరెడ్డి బావోద్వేగానికి లోనయ్యారు. జగతయ్య గొప్ప నాయకుడు అని కొనియాడారు.

అత్తింటి వేధింపులకు వివాహిత బలి



శృతి (ఫైల్)

మద్దిరాల (తుంగతుర్తి) : అత్తింటి వేధింపులకు ఓ వివాహిత బలైంది. సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలం రెడ్డిగూడెంలో చోటు చేసుకున్న ఈ విషాదకర ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. ములుగు జిల్లా మంగపేట మండలం కత్తిగూడెం గ్రామానికి చెందిన బోటమంచి శాంతయ్య కుమార్తె శృతి(32)కి దగ్గరి బంధువు మద్దిరాల మండలం రెడ్డిగూడెం గ్రామానికి చెందిన నాగెల్లి ఉపేందర్‌తో 13ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి కుమారుడు, కూతురు సంతానం. ఉపేందర్ కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కొంతకాలంగా ఉపేందర్ మద్యానికి బానిసగా మారి భార్యను వేధించడంతో పాటు చిత్రహింసలకు గురిచేస్తున్నాడు. దీనికి తోడు ఆర్థిక ఇబ్బందులు అధికం కావడంతో శృతి తీవ్ర మనస్తాపానికి గురైంది. ఈ నేపథ్యంలోనే శృతి శుక్రవారం సాయంత్రం ఇంటి నుంచి గ్రామ శివారుకు వెళ్లి ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుంది. కొద్ది సేపటికి గమనించిన గ్రామస్తులు మంటలు ఆర్పి సూర్యాపేట ఆస్పత్రికి తరలించారు. 90శాతం కాలిన శృతిని అక్కడి నుంచి గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతిచెందింది. మృతురాలి సోదరుడు తరుణ్ భర్త వేధింపులతోనే శృతి ఆత్మహత్యాయత్నానికి ఒడిగట్టిందని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ. రవీందర్ తెలిపారు.

చికిత్స పొందుతున్న మహిళ మృతి

రామగిరి(నల్లగొండ): అనారోగ్య కారణాలతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళ మృతిచెందింది. తిప్పర్తికి చెందిన గంగనబోయిన కోటమ్మ(56) వ్యవసాయ మార్కెట్‌లో స్వీపర్‌గా పని చేస్తోంది. కొంత కాలంగా కోటమ్మ మోకాళ్ల నొప్పులతో బాధపడుతోంది. 4రోజుల క్రితం హైదరాబాద్‌ని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో మోకాళ్ల మార్పిడి చేయించుకుంది. ఆరోగ్యపరిస్థితి విషమించి శనివారం మృతిచెందినట్లు స్థానికులు తెలిపారు.

రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి దుర్మరణం



నవీన్ (ఫైల్)

చిట్యాల : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులు దుర్మరణం చెందారు. చిట్యాల, గుండాల మండలాల పరిధిలో చోటు చేసుకున్నట్లు ఈ ఘటనల వివరాలు ఇలా ఉన్నాయి. సూర్యాపేట జిల్లా రెడ్డిగూడెం గ్రామానికి చెందిన కసనబోయిన నర్సయ్య(50)మతిస్థిమితం కోల్పోయాడు. ఎవరికీ చెప్పకుండా ఇంటినుంచి వెళ్లి తిరుగుతున్నాడు. నర్సయ్య శనివారం చిట్యాల మండలం వెలిమినేడు శివారులో హైవే దాటుతున్నాడు. ఈ క్రమంలో విజయవాడ వైపు నుంచి హైదరాబాద్ వైపునకు వెళుతున్న ట్యాంకర్ ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇరుగు రవి తెలిపారు.

ట్రాక్టర్ కిందపడి..

గుండాల : గుండాల మండలం మాసాన్‌పల్లికి చెందిన గుబ్బ మురళి, సువర్ణ దంపతుల పెద్ద కుమారుడు గుబ్బ నవీన్ (23) మిర్యాలగూడ మండలం తడకమల్లలో అమ్మమ్మ వద్ద ఉంటూ మిర్యాలగూడలోని ఓ ఫొటో స్టూడియోలో పనిచేస్తున్నాడు. ఇటీవల స్వగ్రామానికి వచ్చిన నవీన్ శనివారం ట్రాక్టర్‌తో తమ సొంత పొలాన్ని దున్నాడు. అనంతరం పెదనాన్న పొలాన్ని కూడా దున్నుతుండగా ట్రాక్టర్ దిగబడింది. కల్టివేటర్ ఊడదీసి ట్రాక్టర్ వీల్స్‌లో కర్రలు పెట్టి లేపుతున్న క్రమంలో తిరగబడి నవీన్‌పై పడడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. విషయం తెలుసుకుని ఘటనా స్థలానికి చేరుకున్న తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించిన తీరు అక్కడున్న వారిని కంటతడి పెట్టించింది.

అంత్యక్రియలకు వెళ్లి వస్తూ..

మర్రిగూడ: మర్రిగూడ మండలం యరగండ్లపల్లి గ్రామానికి చెందిన సిలివేరు పుల్లమ్మ(53), ముత్తయ్య దంపతులు శుక్రవారం నాంపల్లి మండలం లింగోటం గ్రామంలో తమ సమీప బంధువు దహన సంస్కారాలకు హాజరై బైక్‌పై తిరిగి వస్తున్నారు. మర్రిగూడ తహసీల్దార్ కార్యాలయం సమీపానికి చేరుకోగానే డీసీఎం వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఇద్దరిని హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పుల్లమ్మ మృతిచెందగా ముత్తయ్య పరిస్థితి విషమంగా ఉంది. వారికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. కుమారుడు నర్సింహ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రంగారెడ్డి తెలిపారు.

ఉద్యోగ విరమణ పొందిన జవాన్‌కు ఘన స్వాగతం



జవాన్ కృష్ణను సన్మానిస్తున్న గ్రామస్తులు



జవాన్ కృష్ణను గ్రామంలో ఊరేగిస్తున్న ప్రజలు

చిలుకూరు: చిలుకూరు మండలంలోని పోలేనిగూడేనికి చెందిన బత్తిని కృష్ణ 20 ఏళ్లుగా ఇండియన్ ఆర్మీలో పని చేస్తూ ఉద్యోగ విరమణ పొంది స్వగ్రామానికి వచ్చిన సందర్భంగా స్థానికులు శనివారం ఘన స్వాగతం పలికారు. పూలమాలలతో సన్మానించి ఊరేగించారు. పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ దేశానికి సేవ చేసిన జవాన్ కృష్ణను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ బండ్ల ప్రశాంతి కోటయ్య, జెడ్పీటీసీ బొలిశెట్టి శిరీష నాగేంద్రబాబు, సర్పంచ్ బండ్ల వెంకటమ్మ, ఉప సర్పంచ్ చంద్రకళ, బాదె అంజనేయులు, లింగయ్య, గోపయ్య, నరేష్, మండవ సత్యం, రాధిక, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.